# వెన్నముద్ద కృష్ణుడిగా యాదగిరీశుడు

● రాత్రి కాళీయమర్ధనుడి అలంకారంలో దర్శనమిచ్చిన స్వామివారు ● యాదగిరిగుట్టలో వైభవంగా సాగుతున్న అధ్యయనోత్సవాలు

యాదగిరిగుట్ట, డిసెంబర్ 26 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయంలో అధ్యయనోత్సవాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. మంగళవారం నిత్య కైంకర్యాల అనంతరం అమ్మవారికి మార్గళి పూజల్లో భాగంగా 21వ పాశురాలను అర్చకులు, పారాయణందారులు పఠించారు. అనంతరం స్వామివారి అలంకార సేవలు ఆగమశాస్త్రరీతిలో జరిగాయి. ఉదయం వెన్నముద్ద కృష్ణుడిగా యాదగిరీశుడు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారిని వెన్నముద్ద కృష్ణుడిగా అలంకరించి ప్రత్యేక సేవపై అధిష్ఠింపజేసి సేవోత్సవాన్ని నిర్వహించారు. సేవోత్సవంలో దివ్య ప్రబంధ పఠనం కొనసాగించారు. ఆలయ ప్రధానార్చకుడు నల్లన్‌థీఘల్ లక్ష్మీనరసింహాచార్యులు, అర్చక బృందం దివ్య ప్రబంధ పఠనం చేస్తుండగా అలంకార సేవలను ప్రధానాలయ మాఢవీధుల్లో ఊరేగించారు. స్వామి దర్శనానికి వచ్చిన భక్తులు అలంకార సేవలను కనులారా వీక్షించి తరించారు.


కాళీయమర్ధనుడి అలంకారంలో స్వామివారు

### వెన్నముద్ద కృష్ణుడి విశిష్టత..

శ్రీకృష్ణుడి బాల్య లీలలో నవనీత చోరలీల ఎంతో ప్రశస్థమైంది. నవవిధతత్వాల సమాహారమే నవనీతం (వెన్న). పంచభూతాలు, ప్రకృతి, బుద్ధి, మనస్సు, అహంకారం ఇలా తొమ్మిదింటి కలిగిన జీవుడిని ఉద్ధరించడమే ఈ నవనీత తత్వం. శ్రీకృష్ణుడు తనకు సమర్పించిన వెన్నను తానే వివిధ పద్ధతుల్లో దొంగిలించి దానిని అందరికీ పంచి ఆనందింపజేసిన రీతి అద్భుతమైనది. ఆళ్వారాదులు ఈ లీలలో స్వామివారిని దర్శించి వారి దివ్య ప్రబంధాలలో ఎంతో గొప్పగా స్తుతించారని ఆలయ ప్రధానార్చకుడు నల్లన్‌థీఘల్ లక్ష్మీనరసింహాచార్యులు తెలిపారు.

### రాత్రి కాళీయమర్ధనుడి అలంకారం

అధ్యయనోత్సవాల్లో భాగంగా రాత్రి వేళ లక్ష్మీనరసింహస్వామిని కాళీయమర్ధనుడిగా అలంకరించి ఊరేగించారు. ద్రావిడ ప్రబంధ సేవాకాలంలో పారాయణిక స్వాములతో సేవోత్సవం చేపట్టారు. ఈ వేడుకను అర్చకులు అత్యంత వైభవంగా నిర్వహించారు. కాళీయమర్ధనుడి అలంకారంలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం స్వామి అలంకార సేవకు హారతినిచ్చి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

### కాళీయమర్ధన అలంకార సేవ విశిష్టత

శ్రీకృష్ణావతారంలో భగవానుడిని దర్శింపజేసిన లీలల్లో ఒకటి కాళీయమర్ధన లీల. యమునా నది వల్ల ఏర్పడిన ఒక మడుగులో కాళీయుడను ఒక విష సర్పం నివాసం ఏర్పాటు చేసుకుంది. ఆ కాళీయుని భయంకర విష ప్రభావంతో మడుగులో నివసిస్తున్న ప్రాణులు, తీర ప్రాంతంలోని జంతువులు, వృక్షాలు, మడుగు మీదుగా ఎగిరే పక్షులన్నీ మరణిస్తున్నాయి. ప్రాణులను రక్షించేందుకు శ్రీకృష్ణుడు కదంబ వృక్షంపై నుంచి కాళీయుని పడగలపైకి దూకి తాండవమాడాడు. శ్రీకృష్ణుడి పదఘాతంతో కాళీయుని పడగలు చితికిపోయాయి. అప్పుడు కాళీయుని భార్యలు శరణు కోరగా ఈ మడుగును వదిలి సముద్రంలోకి వెళ్లాలని ఆజ్ఞాపించాడు. భక్తవత్సలుడైన భగవానుడు ఎల్లవేళలా ప్రాణులను రక్షించునని ఈ సంఘటనతో తెలిసింది. కాళీయమర్ధన అలంకారంలో స్వామివారిని దర్శించుకుంటే సర్పదోష నివారణ కలుగునని ఆలయ ప్రధానార్చకుడు నల్లన్‌థీఘల్ లక్ష్మీనరసింహాచార్యులు వెల్లడించారు.

**స్వామివారిని దర్శించుకున్న ప్రముఖులు**

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి రాహుల్ కశ్యప్, రాష్ట్ర కమ్యూనికేషన్ డీఐజీ జక్కుల రామ్మోహన్, ఐఏఎస్ అధికారి హరీశ్ కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. వారికి ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా, ఆలయ అధికారి రాజన్‌బాబు స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు.

### ఉత్సవమూర్తులకు సువర్ణ పుష్పార్చన

స్వామివారి సన్నిధిలో ఉత్సవమూర్తులకు సువర్ణ పుష్పార్చన అత్యంత వైభవంగా సాగింది. ముఖ మండపంలో ఉత్సవమూర్తుల పాదాల వద్ద 108 బంగారు పుష్పాలు ఉంచి అష్టోత్తర నామాలు పఠిస్తూ అర్చించారు. అనంతరం స్వామివారికి హారతినిచ్చి భక్తుల గోత్రనామాలు పేరిట సంకల్పం చేశారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవారలకు నిజాభిషేకం, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టారు. సాయంత్రం వేళ స్వామివారికి దర్బార్ సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. రాత్రి వేళ స్వామివారికి తిరువారాధన చేపట్టి, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన జరిపారు. క్షేత్రపాలకుడైన ఆంజనేయస్వామికి ఆకుపూజ ఘనంగా జరిగింది. పాతగుట్టలో స్వామివారికి నిత్యారాధనలు వైభవంగా సాగాయి. వరుస సెలవులు రావడంతో స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారు. 25వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. స్వామివారి ఖజానాకు రూ.54,64,760 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ రామకృష్ణారావు, అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి తెలిపారు.


ఆలయ మాఢ వీధుల్లో వెన్నముద్ద కృష్ణుడి అలంకారంలో స్వామివారి ఊరేగింపు


నల్లగొండలో సన్నాహక సమావేశానికి హాజరైన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, వేముల వీరేశం, బీఎల్ఆర్

# 'ప్రజా పాలన' పకడ్బందీగా నిర్వహించాలి

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించే ప్రజాపాలన కార్యక్రమంలో పకడ్బందీగా, ప్రణాళికాబద్ధంగా దరఖాస్తులు స్వీకరించాలని ఆదేశించారు. ఇందుకోసం ఏర్పాట్లు పక్కాగా ఉండాలని, అందరికీ సౌకర్యంగా ఉండేలా ప్రణాళికలు రూపొందించి ప్రజలు దరఖాస్తులు నింపేలా యంత్రాంగాన్ని సమాయత్తం చేసుకోవాలని అన్నారు. హెల్ప్ డెస్క్, సాధారణ దరఖాస్తుల కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రద్దీ ఎక్కువ ఉన్న చోట టీమ్‌లను పెంచాలని, రాష్ట్ర ప్రభుత్వ ప్రథమ కార్యక్రమాన్ని సమన్వయంతో విజయవంతం చేయాలని ఆదేశించారు.

### వంద రోజుల్లో ఆరు గ్యారెంటీల అమలు : మంత్రి ఉత్తమ్

వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని, ప్రభుత్వ ఉద్దేశాలను అధికారులు నెరవేర్చాలని రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖల మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. ఆరు గ్యారెంటీల్లో రెండింటిని ఇప్పటికే అమలు చేస్తున్నామని, రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇచ్చే కార్యక్రమం త్వరలో మొదలు పెడుతామని చెప్పారు. ప్రజల సంక్షేమంలో పారదర్శకంగా, ప్రజాస్వామ్యయుతంగా ఉంటామని.. అధికారులు కూడా న్యాయంగా, ధర్మంగా, చట్టపరంగా ముందుకెళ్లాలని సూచించారు. ప్రజాపాలన కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తుల ఆధారంగానే ఆరు గ్యారెంటీలు అమలవుతాయన్నారు. తమ ప్రభుత్వం పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తుందని తెలిపారు. రేషన్ కార్డులపై కిలోకు రూ.39 వెచ్చించి పంపిణీ చేస్తున్న బియ్యం రీసైక్లింగ్ అవుతూ పౌల్ట్రీలకు వెళ్తున్నదని, ఇది దుర్మార్గమైన విషయమని పేర్కొన్నారు. రేషన్ బియ్యం రీ సైక్లింగ్ చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రేషన్ సరఫరాలో ప్రక్షాళన చేస్తామని ,నిబంధనలు కఠినంగా అమలు చేస్తామని అన్నారు.

యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతు కె.జెండగే జిల్లాలో చేపట్టే ప్రజాపాలన కార్యక్రమ ఏర్పాట్లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమాన్ని పకడ్బందీ ఏర్పాట్లతో ప్రజల వద్దకు తీసుకెళ్తామని, ప్రభుత్వం ఆశించే లక్ష్యాలను నెరవేరుస్తామని అన్నారు. మున్సిపాలిటీల్లో 14, గ్రామీణ ప్రాంతాల్లో 37 కలిపి మొత్తం 51 బృందాలతో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఇందుకోసం 1961 కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. గ్రామసభల్లో ఎవరైనా దరఖాస్తులు ఇవ్వలేకపోతే వారి వద్ద నుంచి తిరిగి తీసుకుంటామని, ఆ సమయంలో రాకపోయినా తర్వాత కూడా స్వీకరిస్తామని తెలిపారు. సన్నాహక సమావేశంలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్ రెడ్డి, బాలూనాయక్, వేముల వీరేశం, నల్లమాద పద్మావతి, బత్తుల లక్ష్మారెడ్డి, కుందూరు జయవీర్‌రెడ్డి, మందుల సామేల్, అదనపు కలెక్టర్లు జె.శ్రీనివాస్, భాస్కర్‌రావు, వెంకట్‌రెడ్డి, నల్లగొండ ఎస్పీ అపూర్వరావు, భువనగిరి డీసీపీ రాజేశ్‌చంద్ర, సూర్యాపేట ఏఎస్పీ నాగేశ్వర్‌రావు, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

**ప్రజా పాలనకు తగిన ఏర్పాట్లు చేయాలి : మంత్రి కోమటిరెడ్డి**

పటిష్టమైన ఏర్పాట్లు, తగిన టీమ్‌లతో ప్రజా పాలన దరఖాస్తులను స్వీకరించాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సూచించారు. మంచినీరు, కుర్చీలు, ఇతర వసతులు కల్పించాలని, ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. గిరిజన గ్రామ పంచాయతీల్లో దరఖాస్తుదారులు ఎవరూ మిస్ కావద్దని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని అన్నారు. రాష్ట్రాన్ని గాడిలో పెడుతూ పేదల వద్దకు ప్రభుత్వ పథకాలు తీసుకుపోవాలనేదే తమ ప్రభుత్వ ఉద్దేశమని పేర్కొన్నారు. అధికారులు ఎక్కువ గంటలు పని చేయాలని, తెలంగాణ పునర్నిర్మాణంలో పాల్పంచుకోవాలని సూచించారు. యువతను పెడదారి పట్టించే బెల్ట్ షాపులు, గంజాయి అమ్మకాలపై పోలీసులు ఎక్కువ శ్రద్ధ పెట్టాలని.. ఇసుక, గంజాయి, వైన్ మాఫియాలపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడానికి అన్ని ఏర్పాట్లు చేసి అందరికీ అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు.


సన్నాహక సమావేశానికి హాజరైన ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు

# హృదయ స్పందనలు వినిపించేదే కవిత్వం

● కవి, రచయిత సుంకిరెడ్డి నారాయణరెడ్డి

రామగిరి, డిసెంబర్ 26 : మానవీయ హృదయ స్పందనలను వినిపించేదే నిజమైన కవిత్వమని ప్రముఖ సాహితీవేత్త, కవి, రచయిత సుంకిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. నల్లగొండకు చెందిన ఆర్థకవి బైరెడ్డి కృష్ణారెడ్డి రచించిన 'సడిలేని గోస' దీర్ఘ కవితా పుస్తకం పరిచయ సభ మంగళవారం నల్లగొండలోని ఉనికి సామాజిక సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. బైరెడ్డి తన కవిత్వంలో మానవీయ బంధాలను మృత్యుస్పృహను అర్థవంతంగా వ్యక్తీకరించారని తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ రచయిత మేరెడ్డి యాదగిరిరెడ్డి, అంబటి వెంకన్న, బండారు శంకర్, సాగర్ల సత్తయ్య, పగడాల నాగేందర్, మునాస్ వెంకట్, స్కైబాబా, లింగన బోయిన లేఖానందస్వామి పాల్గొన్నారు.



సడిలేని గోస కవితా పుస్తక పరిచయ సభలో మాట్లాడుతున్న సుంకిరెడ్డి నారాయణరెడ్డి